సాక్షి

శ్రీసత్యసాయి జిల్లా

శుక్రవారం । 14 । ఫిబ్రవరి । 2025



టన్ను చీనీ రూ.24,300

అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.24,300, కనిష్టం రూ.5 వేలు, సరాసరిన రూ.12 వేల ప్రకారం క్రయవిక్రయాలు జరిగాయి.



కిలో టమాట రూ.10

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.10, కనిష్టంగా రూ.6, సరాసరిన రూ.8 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం

37.4°/11.5°

జిల్లా పరిధిలో గురువారం చలి వాతావరణం నెలకొంది. పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

బయోమెట్రిక్ తప్పనిసరి

- కలెక్టర్ టీఎస్ చేతన్



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా సమయానికి బయోమెట్రిక్ హాజరు వేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్‌హాల్ నుంచి జిల్లాలోని అన్ని మండలాల ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, డివిజనల్ పంచాయతీ అధికారులతో పలు అంశాలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సర్వేల నిర్వహణలో భాగంగా సేకరిస్తున్న డేటా పుట్టపర్తిలో పెండింగ్ ఉందని, అలాగే తనకల్లు, కనగానిపల్లి, పరిగి మండలాల్లో పౌరుల డేటా తప్పిపోవడంపై తగిన చర్యలు చేపట్టాలన్నారు. పురోగతి లేకపోతే మాత్రం సంబంధిత ఎంపీడీఓలపై చర్యలు తప్పవన్నారు. అలాగే పరిసరాల శుభ్రత విషయంలో డివిజన్ పంచాయతీ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. డీపీఓ సమత, గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ ఆఫీసర్ సుధాకర్‌రెడ్డి, జెడ్పీ డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, పరిశ్రమలశాఖ జీఎం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చింతపండు.. అమ్మకాల్లో రికార్డు

- ఫైన్ రకం క్వింటా రూ.38,000



మార్కెట్‌కు వచ్చిన చింతపండు

హిందూపురం అర్బన్: చింత పండు ధరలు రోజూ పెరుగుతున్నాయి. హిందూపురం వ్యవసాయ మార్కెట్‌కు గురువారం 818 క్వింటాళ్ల చింతపండు రాగా ఈ నామ్ పద్ధతిలో వేలం పాట నిర్వహించారు. మార్కెట్‌లో ఫ్లవర్ (మీడియం) రకం క్వింటాళ్లకు గరిష్టం రూ.11,000, కనిష్టం రూ.4,500 , సగటు రూ.6,000 పలికింది. కరిపులి రకం (బెస్ట్ క్వాలిటీ) క్వింటా గరిష్టం రూ.38,000, కనిష్టం రూ.8,000, సగటు రూ.15,500 పలికినట్లు మార్కెట్ కార్యదర్శి జి.చంద్రమౌళి తెలిపారు. మార్కెట్‌లో ఫైన్ రకం 38,000 పలకడం ఈ ఏడాది ఇదే మొదటిసారనన్నారు. వ్యాపారులు, రైతులు నాణ్యమైన సరుకు మార్కెట్‌కు తీసుకొచ్చి మంచి ధరలు పొందాలన్నారు.

అశ్వవాహనంపై కొండమీదరాయుడు




అశ్వవాహనంపై ఊరేగుతున్న కొండమీదరాయుడు

బుక్కరాయసముద్రం: బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి కొండమీదరాయుడు అశ్వవాహనంపై ఊరేగారు. అర్చకులు ముందుగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. వేద మంత్రాల నడుమ మంగళ వాయిద్యాలతో పుర వీధులలో ఊరేగించారు. మహిళలు స్వామి వారికి హారతులు పట్టి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కాగా, స్వామి వారి బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో ముగియనున్నాయి. ఆలయంలో శుక్రవారం ఉదయం 8 గంటలకు తీర్థవాది వసంతోత్సవం నిర్వహిస్తారు. రాత్రి హంస వాహన సేవ ఉంటుందని అర్చకులు శ్రీనాథ్ స్వామి తెలిపారు.

వీఆర్వో చంద్రశేఖర్ బదిలీ

తాడిపత్రి రూరల్: 'రేషన్‌కార్డు కావాలంటే నీ కూతురిని నా వద్దకు పంపించు' అన్న వీఆర్ఓపై బదిలీ వేటు పడింది. వీఆర్ఓ తనను వేధిస్తున్నారంటూ వారం క్రితం బాధితురాలు సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో కలకలం రేగింది. దీనిపై ఆర్డీఓ కేశవనాయుడు, తాడిపత్రి ఏఎస్పీ రోహిత్‌కుమార్ బాధితురాలిని విచారించారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు ఆర్డీఓ పంపారు. ఈ క్రమంలోనే వీఆర్వో చంద్రశేఖర్‌ను గుంతకల్లును బదిలీ చేశారని గురువారం తహసీల్దార్ రజాక్‌వలి తెలిపారు.

అవినీతి ఖజానా



- ఇచ్చినంత తీసుకోండి డిమాండ్ చేయొద్దు !
- సిబ్బందికి ట్రెజరీ అధికారి మౌఖిక ఆదేశాలు
- విచారణ చేయిస్తే అందరం బుక్ అవుతామని వెల్లడి
- 'ఫైనలిస్తేనే ప్రసాదం..' కథనంతో ఖజానా శాఖలో అలజడి

"ఇచ్చినంత తీసుకోండి. అంత కావాలి.. ఇంత కావాలి.. అని డిమాండ్ చేయొద్దు"

– ట్రెజరీ సిబ్బందికి సమావేశంలో జిల్లా అధికారి ఇచ్చిన మౌఖిక ఆదేశం.

"మా తప్పు లేదని సంతకం చేయండి.."

– పెన్షనర్ల అసోసియేషన్ సభ్యుల సమావేశంలో అధికారి కోరిన తీరు. ససేమిరా అన్న అసోసియేషన్ సభ్యులు.

"విచారణ చేయిస్తే అందరి పేర్లు బయటికి వస్తాయి.. ముందుగా ఏదో ఒకటి చేసేసుకోవాలి.."

– స్నేహితులతో ట్రెజరీలోని ఓ అధికారి ఫోన్ సంభాషణ.

ఖజానా (ట్రెజరీ) శాఖలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారుల సంఖ్య రోజురోజుకీ పెరిగిపోతోంది. 'ఇచ్చినంత తీసుకోండి.. అంత.. ఇంత కావాలనే డిమాండ్ వద్దు' అని సిబ్బందికి జిల్లా అధికారి మౌఖిక ఆదేశాలు జారీ చేయడంతో అందరూ ఆశ్చర్యపోయారు. అవినీతి పర్వం ఒకరితో మొదలై.. ఐదారుగురి పేర్లు బయటికి వచ్చాయి. పూర్తిస్థాయిలో విచారణ జరిగితే అందరం బుక్ అవుతామని.. ఎవరికి వారుగా జాగ్రత్తగా ఉండాలనే నిర్ణయానికి వచ్చారు. అయితే బయటికి మాత్రం మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తూ.. తమకు.. శాఖలో పని చేసే సిబ్బందిపై వస్తున్న అవినీతి ఆరోపణలకు ఎలాంటి సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారు.

సాక్షి, పుట్టపర్తి: ఖజానా శాఖలో అధికారుల అవినీతి వ్యవహారం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అధికారులే అవినీతిని ప్రోత్సహించేలా తీసుకుంటున్న చర్యలు అందరినీ షాక్‌కు గురిచేస్తున్నాయి. కొందరి ఫిర్యాదుతో ఇటీవల వార్తా పత్రికల్లో కథనాలు ప్రచురితమయ్యాయి. పెన్షనర్లను ఇబ్బంది పెడుతూ లంచాలు డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఒకరిపై ఒకరు నెపం రుద్దుతూ లబ్ధిదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఫలితంగా ఆరు నెలలు దాటినా ఫైళ్లు ముందుకు కదలడం లేదు. ఎంతోమంది పింఛన్‌దారులు లంచాలు ఇవ్వలేక.. పింఛన్ పొందలేక ఆ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు.

'అసోసియేషన్'తో అత్యవసర భేటీ..

ఖజానా శాఖలో అవినీతి దందాపై వార్తలు బయటికి వచ్చిన వెంటనే ఆగమేఘాల మీద పెన్షనర్ల అసోసియేషన్ సభ్యులతో సోమవారం సమావేశం నిర్వహించారు. అధికారులు లంచాలు తీసుకోవడం లేదనే అంశంపై మద్దతు తెలుపుతూ లెటర్ ప్యాడ్‌పై సంతకాలు పెట్టాలని అధికారులు కోరారు. అయితే సమావేశానికి హాజరైనట్లు మాత్రమే సంతకాలు చేస్తామని.. మిగతా విషయాలపై తామెందుకు అంగీకరిస్తామని అసోసియేషన్ సభ్యులు ససేమిరా అనడంతో ఖజానా అధికారి కంగుతిన్నారు. ఏదో విధంగా అవినీతి మరక తుడిచేసుకోవాలని నానా అవస్థలు పడుతున్నారని చెప్పడానికి ఇదో చక్కటి ఉదాహరణ.

'విచారణ చేయిస్తే అందరం బుక్'..

ఖజానా శాఖలో అవినీతి ఆరోపణలపై విచారణ చేయిస్తే అందరం బుక్ కావడం గ్యారంటీ అని ఓ అధికారి తన స్నేహితులతో ఆందోళన వ్యక్తం చేశారు. గత ఆర్నెల్లుగా ఏ ఫైలు లంచం లేనిదే ముందుకు కదలలేదన్న విమర్శలున్నాయి. పైగా మద్యం బాటిళ్ల వ్యవహారం వెనుక ఇద్దరు - ముగ్గురి పాత్ర ఉందని ఫోన్ ద్వారా మాట్లాడుకోవడంపై జిల్లా అధికారి కూడా సీరియస్ అయినట్లు తెలిసింది. డబ్బుల వ్యవహారంలో వాటా ఇస్తే.. ఊరుకుంటారు.. కానీ మద్యంతో ఆమెకు ఏం సంబంధం అంటూ సదరు అధికారులు గుసగుసలాడుకోవడం ఆశ్చర్యం కలిగించింది.

ఆర్టీఐ ద్వారా మాత్రమే అడగాలి

ట్రెజరీలో ఎలాంటి సమాచారం కావాలన్నా.. సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) ద్వారా మాత్రమే అడగాలి. కార్యాలయానికి వచ్చి అడిగితే.. ఎవరికీ ఇవ్వకూడదనే నిబంధన మాకు ఉంది. ఎవరి సమాచారం కావాలో కూడా అందులో మెన్షన్ చేయాల్సి ఉంటుంది. ట్రెజరీలో అవినీతి ఆరోపణల విషయంపై స్పందించాల్సిన అవసరం లేదు.

– నాగమల్లిక, జిల్లా ట్రెజరీ అధికారి

సీఐ రామయ్యపై సస్పెన్షన్ వేటు

పుట్టపర్తి టౌన్: న్యాయం చేయాలంటూ పోలీసుస్టేషన్‌కు వెళ్లిన ఓ మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యవహారంలో మడకశిర సీఐ రాగిరి రామయ్యను సస్పెండ్ చేస్తూ గురువారం ఎస్పీ రత్న ఉత్తర్వులు జారీ చేశారు. మడకశిర మండలం టీడీపల్లి తండాలో ఇరువర్గాల మధ్య పొలం సరిహద్దుల విషయంలో గొడవ జరిగింది. ఇరువర్గాలకు సర్ది చెప్పాలని మడకశిర పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన తనతో సీఐ అసభ్యకరంగా ప్రవర్తించాడని ఈనెల 6న పోలీస్ కార్యాలయంలో ఎస్పీ రత్నకు బాధితురాలు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఎస్పీ స్పందించి డీఎస్పీ ఆదినారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి విచారణకు ఆదేశించింది. ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందం సీసీ పుటేజీ పరిశీలించారు. రెండు రోజుల క్రితం రామయ్యను వీఆర్‌కు పంపుతూ ఉత్తర్వులు జారీ చేశారు. తాజాగా కేసు విచారణ పూర్తవడంతో డీఐజీ ఆదేశాల మేరకు సీఐ రాగిరి రామయ్యను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

లైబ్రేరియన్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లి ఏపీఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాలలో ఖాళీగా ఉన్న గెస్ట్ లైబ్రేరియన్-1 పోస్టుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎన్వీ మురళీధర్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి గానూ ఖాళీగా ఉన్న గెస్ట్ లైబ్రేరియన్ పోస్టు నియామకాన్ని చేపట్టేందుకు ఉన్నత స్థాయి అధికారులు ఆదేశాలు ఇచ్చారన్నారు. ఏదైనా డిగ్రీతో పాటూ బీఎల్ఐఎస్‌ఈ డిగ్రీ ఉత్తీర్ణులైన వారు మాత్రమే అర్హులన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 16 లోపు దరఖాస్తులు సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 87126 25065 ను సంప్రదించాలన్నారు.

అమ్మో.. చికెన్!





కోళ్ల ఫారంలో పెంచుతున్న కోళ్లు

- జిల్లాలో తగ్గిన చికెన్ విక్రయాలు
- మాఘమాసం, వ్యాధుల ప్రభావమే కారణం

జిల్లాలో పౌల్ట్రీ పరిశ్రమలు	175
లేయర్ ఫారాలు	18
బాయిలర్ ఫారాలు	157

హిందూపురం అర్బన్: జిల్లాలో చికెన్ విక్రయాలు తగ్గాయి. మాఘమాసం, వ్యాధుల ప్రభావంతో చాలా మంది చికెన్ జోలికి వెళ్లడం లేదు.

పడిపోయిన విక్రయాలు..

జిల్లాలో రోజుకు సగటున 65 మెట్రిక్ టన్నుల చికెన్ విక్రయాలు జరిగేవి . ఇందులో హిందూపురం, కదిరి, ధర్మవరం, మడకశిర పట్టణాల్లోనే సగం వ్యాపారం అయ్యేది. వారం రోజుల్లో విక్రయాలు సగానికి పడిపోయాయి. 30 టన్నులు కూడా అమ్ముడుపోవడం లేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇలాగే కొనసాగితే దుకాణాలు మూసుకోవాల్సిందేనని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

17 వేల కుటుంబాలకు ఉపాధి..

జిల్లాలో 173 పౌల్ట్రీ పరిశ్రమలు ఉన్నాయి. వీటి ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 17 వేల కుటుంబాలకు ఉపాధి లభిస్తోంది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో వారం రోజులుగా చికెన్ విక్రయాలు గణనీయంగా పడిపోయాయి. 10 రోజుల క్రితం వరకూ కేజీ చికెన్ రూ.220-230 వరకు అమ్మగా.. గురువారం కిలో రూ.170-180 వరకూ అమ్మకం చేస్తున్నారు. లైవ్ కోడి రూ.80 పలుకుతోంది. కోడి గుడ్డు ధరలోనూ 10 రోజుల్లోనే ఒక రూపాయి తగ్గుదల కనిపించింది. ఒక్కో గుడ్డు రూ.6 కు అమ్ముతున్నారు.

వ్యాపారాలు తగ్గాయి



మాఘమాసం, బర్డ్ ఫ్లూ భయంతో పది రోజులుగా చికెన్ అమ్మకాలు తగ్గాయి. మన ప్రాంతంలో బర్డ్ ఫ్లూ లేదని .. ఎక్కడో తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలో ఉన్నట్లు టీవీల్లో చూశాం. అయితే ఆ భయం ఇక్కడి వ్యాపారాలపై పడింది. కిలో చికెన్ రూ.220 నుంచి రూ.180 వరకూ తగ్గింది. వ్యాపారాలు కూడా పెద్దగా జరగడం లేదు. – నవాబ్‌ఖాన్, చికెన్ సెంటర్ నిర్వాహకుడు, చిలమత్తూరు

జిల్లాలో ఎక్కడా ప్రభావం లేదు



జిల్లాలో బర్డ్ ఫ్లూ ప్రభావం లేదు. వంద డిగ్రీల సెంటీగ్రేడ్ కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలో మాంసాన్ని ఉడికిస్తాం. అందువల్ల ఎలాంటి ప్రభావం ఉండదు. బర్డ్ ఫ్లూ వైరస్ 70 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకే బతకగలదు. అందువల్ల భయపడాల్సిన పనిలేదు. కోడి గుడ్లు బాగా ఉడికించి తినవచ్చు. కర్ణాటక సరిహద్దున ఆరు చెక్‌పోస్టులు పెట్టి తనిఖీలు చేసి అక్కడి వైద్యులు సర్టిఫై చేసిన కోళ్లనే అనుమతిస్తున్నాం. ప్రతి కోళ్ల పరిశ్రమ, చికెన్ సెంటర్‌కు మా శాఖ సిబ్బంది వెళ్లి తనిఖీ చేసి సూచనలు చేస్తున్నారు. – శుభదాస్, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి, పుట్టపర్తి

'పురం'లో అత్యవసర సమావేశం



మాట్లాడుతున్న జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి శుభదాస్

హిందూపురం అర్బన్ : పట్టణంలోని పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో ఆశాఖ అధికారులు, సిబ్బందితో గురువారం జిల్లా పశు సంవర్ధకశాఖ డైరెక్టర్ శుభదాస్ అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఉభయ గోదావరి జిల్లాలో బర్డ్ ఫ్లూ నేపథ్యంలో కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో ఆరు చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు శుభదాస్ తెలిపారు. కర్ణాటకలో బర్డ్ ఫ్లూ లేనప్పటికీ ముందు జాగ్రత్తగా అక్కడి నుంచి బాయిలర్ కోళ్లు రాకుండా తగిన చర్యలు చేపట్టామన్నారు.సమావేశంలో డిప్యూటీ డైరెక్టర్ పెంచలయ్య, ఏడీ సోమనాథ్, అధికారులు రమేష్, మోహన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ కోతలపై రైతన్నల ఆగ్రహం



అగళి సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

- అగళిలో కొనసాగుతున్న ఆందోళన
- పట్టించుకోని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

అగళి: విద్యుత్ కోతలు ఆపాలంటూ అగళిలో రైతుల ఆందోళన కొనసాగుతోంది. బుధవారం కూడా విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద రైతులు ధర్నా చేశారు. రైతులు స్టూడియో శ్రీనివాస్, శీవన్న, నాగరాజు, శ్రీనివాస్, గంట నగరాజు, రామన్న, మూడ్ల గిరియప్ప, కుమార్, గోవింద, బాబు, సత్యన్న తదితరులు మాట్లాడారు. వ్యవసాయానికి రోజుకు 9 గంటలు విద్యుత్ ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం, కనీసం మూడు గంటలు కూడా విద్యుత్ సరఫరా చేయడం లేదన్నారు. బోర్లపై ఆధారపడి పంటలు వేసిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. పంటలు ఎండుతున్నాయని, వెంటనే విద్యుత్ కోతలు ఎత్తేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోకపోతే మండలంలోని రైతులు అంత కలసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

గుడ్డు అడిగినందుకు చెంప చెళ్లు!

- గుడిబండ బీసీ హాస్టల్‌లో దారుణం
- ఆవేదనలో విద్యార్థుల తల్లిదండ్రులు



గాయపడ్డ విద్యార్థి (ఫైల్)

గుడిబండ: మండల పరిధిలోని మందలపల్లిలోని ప్రభుత్వ వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలుర వసతి గృహంలో దారుణం చోటుచేసుకుంది. బుధవారం రాత్రి భోజనంలోకి కోడిగుడ్డు అడిగినందుకు అక్కడి సిబ్బంది విద్యార్థుల చెంప చెళ్లుమనింపించారు. పిల్లలకు కడుపునిండా భోజనం కూడా సరిగా పెట్టకుండా, అన్నం తక్కువ తినాలంటూ, కోడిగుడ్డును ఇచ్చినపుడే తినాలంటూ హాస్టల్లో పనిచేసే సిబ్బంది ఆంక్షలు విధించారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోడిగుడ్డు అడిగినందుకు విద్యార్థులను బూతులు తిడుతూ వార్డెన్‌తో పాటు సిబ్బంది కూడా ఓ విద్యార్థిని చితకబాదారు. వాతలు పడేలా కొట్టడంతో ఆ విద్యార్థి కన్నీరు మున్నీరయ్యాడు. కోడిగుడ్లను సక్రమంగా ఇవ్వకుండా అమ్ముకుంటున్నారని విద్యార్థులు చెబుతున్నారు. ఇక్కడ పెట్టే నాసిరకం భోజనం తింటే తమ ప్రాణాలు పోతాయని ఈ వార్డెన్, సిబ్బంది తమకు వద్దంటూ విద్యార్థులు తేల్చి చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి హాస్టల్ వార్డెన్, సిబ్బందిపై తగిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు.



అలంకరణలో బాలా చౌడేశ్వరీదేవి



నాదాలను నోటిలో గుచ్చుకున్న భక్తులు



నాదాలను గుచ్చుకుని ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

నోటికి నాదం.. భక్తిపారవశ్యం !

పరిగి: భక్తుల పాలిట కొంగు బంగారంగా విరాజిల్లుతున్న ఊటుకూరు బాలా చౌడేశ్వరీదేవి అమ్మవారి జాతర మహోత్సవం గురువారం అత్యంత వైభవంగా జరిగింది. ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తిని గ్రామంలో ఊరేగించారు. తర్వాత ప్రత్యేక పోలికేక ప్రాంతంలో అమ్మవారికి గావు కేక నిర్వహించారు. పొలిమేరల దాకా పోలికేక పెట్టుకుంటూ కరుణించు తల్లీ అని భక్తులు వేడుకున్నారు. మరోవైపు దశాబ్దాలు వస్తున్న నాదాల (దబ్బనాలు) గుచ్చే కార్యక్రమం యథావిధిగా సాగింది. కోరిన కోర్కెలు నెరవేర్చాలంటూ భక్తులు నాదాలను నోటికి గుచ్చుకొని ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ భర్త చరణ్‌రెడ్డి వేడుకల్లో పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో సేవలాల్ జయంత్యుత్సవాలు ప్రారంభం



సంత్ సేవాలాల్ మహారాజ్ మూలవిరాట్

గుత్తి రూరల్: మండలంలోని చెర్లోపల్లి గ్రామ పంచాయతీ సేవాగఢ్‌లో వెలసిన సంత్ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో విశేష పూజలు పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ నెల 15వ తేదీ వరకూ మూడు రోజుల పాటు ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. దేశంలోనే ఏకైక ఆలయం కావడంతో వివిధ రాష్ట్రాల నుంచి ఇప్పటికే పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుంటున్నారు. దీంతో భక్తులు ఎలాంటి అసౌకర్యాలకు గురి కాకుండా నిర్వాహకులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. ఉత్సవాలకు శుక్రవారం ఉదయం మహారాష్ట్రకు చెందిన మంత్రి సంజయ్ రాథోడ్ రానున్నారు. దీంతో ఎస్పీ జగదీష్ ఆలయం వద్దకు చేరుకుని మంత్రి పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించారు. సిబ్బందితో మాట్లాడుతూ... భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భద్రతను పర్యవేక్షించాలన్నారు. ఆలయం వెనుక ఉన్న రిజర్వాయర్ వద్దకు ఎవరూ పోకుండా చూడాలన్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా రమేష్‌గౌడ్



చిట్లూరు రమేష్‌గౌడ్

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శిగా అనంతపురం జిల్లా టాస్క్‌ఫోర్స్ సభ్యుడు చిట్లూరు రమేష్‌గౌడ్‌ను అధిష్టానం నియమించింది. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ప్రకటన విడుదల చేసింది.

ప్రేమించి .. మెప్పించి



సందర్భం
నేడు ప్రేమికుల దినోత్సవం

ప్రేమ ఒక అనిర్వచనీయమైన అనుభూతి. మాటలకు అందని మధుర భావన. రెండక్షరాలనే కాదు రెండు హృదయాలనూ ఒకటి చేయగల మహత్తర సాధనం. అంత గొప్ప ప్రేమను పొందాలని ఎవరైనా అనుకుంటారు. జీవిత గమనంలో అందమైన స్థానం కల్పిస్తూ నవ్వుల పువ్వులలో వికసించాలని ఆనందించే వారి కోసమే 'వాలంటైన్స్ డే' వచ్చి వాలింది. 'కనులు తెరిస్తే జననం, కనులు మూస్తే మరణం. ఇంత చిన్న జీవితంలో కడవరకూ నీతోనే ఉండాలని నా మనసు ఆరాటపడుతోంది. అవకాశం ఇస్తావా ప్లీజ్' అంటూ ఏకమైన రెండు హృదయాలు నేడు ఎంతో అన్యోన్యంగా జీవిస్తూ పలువురికి ఆదర్శంగా నిలిచాయి. ప్రేమించి.. పెళ్లి చేసుకుని అందరినీ మెప్పించిన జంటల నేపథ్యంపై ప్రేమికుల రోజు సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

పెద్దలను ఒప్పించి...



గుంతకల్లుకు చెందిన రవితేజ, శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన సానియా ఇద్దరి మతాలు వేరైనా ప్రేమ బంధం వారిని ఒక్కటి చేసింది. 2015లో ఎస్కేయూలో పీజీ చేస్తున్న సమయంలో ఇద్దరి మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమకు దారితీసింది. మతాలు వేరు కాబట్టి తమ పెళ్లికి పెద్దలు అంగీకరిస్తారో లేదోనని భయపడ్డారు. దీంతో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాక పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో 2020లో వార్డు సచివాలయ ఎడ్యుకేషనల్ సెక్రెటర్లుగా ఇద్దరూ ఉద్యోగాలు సాధించారు. ఇరువైపులా కుటుంబ పెద్దలు ఒప్పించి 2022లో గుంతకల్లులోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అందరి సమక్షంలో పెళ్లి చేసుకున్నారు. తమ ప్రేమకు నిదర్శనంగా 2023లో పండంటి మగబిడ్డకు సానియా జన్మనిచ్చారు. తమ ప్రేమను అర్థం చేసుకుని పెళ్లి జరిపించిన ఇరు కుటుంబాల పెద్దలకు ప్రేమికుల దినోత్సవం సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు. – గుంతకల్లు టౌన్

మతాలు వేరైనా...



ఉన్నత విద్యను అభ్యసిస్తున్న సమయంలోనే ఉరవకొండకు చెందిన కొత్త శరత్‌కు నంద్యాల జిల్లా నందికొట్కూరుకు చెందిన సాక్షి (మస్రత్ జహ)తో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. మతాలు వేరు కావడంతో తమ పెళ్లికి పెద్దలు అడ్డు చెపుతారని భావించారు. జీవితంలో నిలదొక్కుకున్న తర్వాత పెద్దల మనసు జయించి పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో మస్రత్ జహ ఎంబీబీఎస్, శరత్ ఎంబీఏ పూర్తి చేశారు. అనంతరం తమ ప్రేమను పెద్దలకు తెలిపి వారి అంగీకారంతో 2020లో వివాహం చేసుకున్నారు. ప్రస్తుతం ఉరవకొండ సీహెచ్‌సీ వైద్యాధికారిగా సాక్షి పనిచేస్తుండగా తమ ప్రేమకి చిహ్నంగా జన్మించిన కుమార్తె సమైరా పేరుతో పాలీ క్లినిక్‌ను నిర్వహిస్తూ ఉచితంగా నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ ఉరగాద్రి చౌడేశ్వరి ఆలయ చైర్మన్‌గా ప్రజలకు శరత్ మరింత చేరువయ్యారు. – ఉరవకొండ

అన్యోన్యతకు మారుపేరు



రొద్దంలో నివాసముంటున్న విజయ్‌కుమార్, అనూష (హిందూపురం) దంపతులు అన్యోన్యతకు మారుపేరుగా నిలిచారు. దాదాపు 15 ఏళ్ల క్రితం బంధువుల ఇంట జరిగిన పెళ్లి వేడుకలో ఇద్దరికి పరిచయం ఏర్పడింది. కొంత కాలం తర్వాత తమ ప్రేమ విషయాన్ని పెద్దలకు తెలిపారు. ఇద్దరి కులాలు ఒక్కటే కావడంతో ఇరువైపులా పెద్దలు అంగీకరించడంతో 14 ఏళ్ల క్రితం పెళ్లి చేసుకున్నారు. రొద్దంలో బార్బర్ షాపు నిర్వహిస్తూ అనూషను కంటికి రెప్పలా విజయ్‌కుమార్ చూసుకుంటున్నాడు. ప్రేమించడం గొప్ప కాదని, పెద్దలను ఒప్పించి, వారి మనస్సు నొప్పించకుండా పెళ్లి చేసుకోడంలో ఉన్న తృప్తి మరెందులోనూ లేదని ఈ సందర్భంగా విజయ్‌కుమార్ దంపతులు అంటున్నారు. – రొద్దం:

రక్త దానంతో ఒక్కటై..



పామిడికి చెందిన బి.రాము హైదరాబాద్‌లోని కొడాక్ బ్యాంకులో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. పామిడిలోని అబ్దుల్ కలాం స్వచ్ఛంద సంస్థ సభ్యుడిగా ఉన్న ఆయన పలు రక్తదానాలను విజయవంతంగా నిర్వహించాడు. ఈ క్రమంలో 2010లో హైదరాబాద్‌లో ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తికి అరుదైన రక్తం అవసరం కావడంతో సోషల్ మీడియాలో పోస్టు పెట్టాడు. గమనించిన అప్పటికే ఎంతోమందికి రక్తదానం చేసిన హైదరాబాద్‌కు చెందిన బి.స్వాతి అనే యువతి వెంటనే ఫోన్ ద్వారా రాముతో మాట్లాడి రక్తదానంతో రోగి ప్రాణాలు కాపాడింది. ఈ పరిచయం వారి మధ్య ప్రేమకు దారి తీసింది. కులాలు (ఎస్సీ, ఓసీ) వేరైనా పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకున్నారు. 15 ఏళ్ల వీరి అన్యోన్య జీవితానికి నిదర్శనంగా ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. – పామిడి

ప్రేమించడం తప్పు కాదు



ఉన్నత విద్యాభ్యాసం చేస్తున్న సమయంలో గుత్తికి చెందిన ఇస్మాయిల్, రషీదా మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. విషయాన్ని పెద్దలకు తెలిపితే తొలుత పెళ్లికి నిరాకరించారు. దీంతో పెద్దలను ఒప్పించేందుకు వీరికి 11 సంవత్సరాలు పట్టింది. చివరకు ఇరువైపులా కుటుంబసభ్యులు అంగీకారం తెలపడంతో 22 ఏళ్ల క్రితం పెళ్లి చేసుకున్నారు. వీరి అన్యోన్య దాంపత్యానికి చిహ్నంగా ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రేమించడం ఎన్నటికీ తప్పు కాదని, అయితే పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకోకపోవడం చాలా తప్పు అని ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఇస్మాయిల్ దంపతులు అంటున్నారు. ప్రేమలో కోపతాపాలు సర్వసాధారణమే అయినా ఒకరినొకరు అర్థం చేసుకుంటే జీవితం ఎంతో ఆనందంగా ఉంటుందని అన్నారు. – గుత్తి

విద్యార్థి జీవితంలో ఇంటర్ విద్య కీలకం

- ఇంటర్ విద్య ఆర్‌జేడీ రవి

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యార్థి జీవితంలో ఇంటర్ విద్య అత్యంత కీలకమని ఇంటర్ విద్య రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) రవి పేర్కొన్నారు. రెండేళ్లు కష్టపడి చదువుకుని గట్టెక్కితే తర్వాత ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. గురువారం జిల్లాలో పర్యటించిన ఆయన ఐదు ప్రాక్టికల్ పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. అనంతరం అనంతపురం నగరంలోని కేఎస్ఆర్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినులతో సమావేశమై మాట్లాడారు. పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, సంకల్ప స్టడీ మెటీరియల్ పంపిణీపై ఆరా తీశారు. థియరీ పరీక్షల దగ్గర పడుతున్న నేపథ్యంలో అందరూ చదువులపై దృష్టి సారించాలన్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ సోషల్ మీడియా జోలికి వెళ్లొద్దన్నారు. సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. తల్లిదండ్రుల ఆశయాలను గుర్తుపెట్టుకొని లక్ష్యం వైపు అడుగులు వేయాలని సూచించారు. ఆయన వెంట జిల్లా పరీక్షల నిర్వాహణ కమిటీ కన్వీనర్, ఆర్ఐఓ ఎం.వెంకటరమణ నాయక్, సభ్యులు వెంకటరంగయ్య, జంతు శాస్త్ర అధ్యాపకుడు జయరాం నాయక్ ఉన్నారు.

మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెట్టండి

- సీనియర్ డీసీఎం మనోజ్



మాట్లాడుతున్న సీనియర్ డీసీఎం మనోజ్

గుంతకల్లు: రైల్వేస్టేషన్లలో వసతుల కల్పనపై దృష్టి పెట్టాలని సంబంధిత అధికారులకు సీనియర్ డీసీఎం మనోజ్ సూచించారు. రైల్వే స్టేషన్లలో వసతుల కల్పన అంశంపై గురువారం స్థానిక డీఆర్ఎం కార్యాలయంలోని మీటింగ్ చాంబర్‌లో డివిజన్ పరిధిలోని 9 సెక్షన్ల కమర్షియల్ సిబ్బందితో ఆయన సమీక్షించారు. రైల్వేస్టేషన్లలో ప్రయాణికులు, ఉద్యోగులకు కావాల్సిన మౌలిక వసుతులపై ఆరా తీశారు. ఆదాయ వనరుల పెంపునకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో డీసీఎం శ్రీకాంత్ రెడ్డి, ఏసీఎం ధనుంజయ్య, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తహసీల్దార్‌కు గాయాలు

పుట్టపర్తిటౌన్: కొడపగానిపల్లి వద్ద గురువారం చోటు చేసుకున్న ప్రమాదంలో కొత్తచెరువు తహసీల్దార్ నీలకంఠారెడ్డికి త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. అనంతపురంలో నివాసముంటున్న ఆయన కారులో కొత్తచెరువుకు వస్తుండగా ఎదురుగా పుట్టపర్తిలో నివాసముంటున్న ధర్మవరం డిప్యూటీ తహసీల్దార్ సురేష్ ప్రయాణిస్తున్న కారు ఢీకొంది. ఘటనలో నీలకంఠారెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని వెంటనే సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించి చికిత్సను అందజేశారు. అనంతరం అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి కుటుంబసభ్యులు తీసుకెళ్లారు.

పాత పద్ధతిలోనే స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించాలి

పుట్టపర్తి టౌన్: స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు పాత పద్ధతిలోనే నిర్వహించాలని ప్రభుత్వాన్ని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా గౌరవాధ్యక్షుడు రజనీకాంతరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు 3వ శనివారం ఏర్పాటు చేయాలంటూ పాఠశాల డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేయడాన్ని ఆక్షేపించారు. పాత పద్ధతి ప్రకారం పూర్తి ఒక రోజు కాంప్లెక్స్‌లు నిర్వహించాలని, సమావేశాల సమయంలో సెలవు వాడుకునే వెసులుబాటు కల్పించాలని, నూతనంగా ఏర్పాటు చేస్తున్న క్లస్టర్ విధానంలో లోటుపాట్లు సరిచూసుకుని స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించాలని కోరారు.

సమాజాభివృద్ధిలో పాత్రికేయుల పాత్ర కీలకం

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్



మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

ధర్మవరం: సమాజాభివృద్ధిలో పాత్రికేయులే కీలకమని వారి సంక్షేమానికి చొరవ తీసుకుంటానని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ అన్నారు.. గురువారం స్థానిక సీఎన్‌బీ ఫంక్షన్ హాల్‌లో ఏపీయూడబ్ల్యూజే ధర్మవరం రెవెన్యూ డివిజన్ ఆధ్వర్యంలో జిల్లా విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు పుల్లయ్య అధ్యక్షత వహించిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మంత్రి సత్యకుమార్, ఆత్మీయ అతిథులుగా ఆర్డీవో మహేష్, నాయకులు పరిటాల శ్రీరామ్, చిలకం మధుసూదన్‌రెడ్డి, ప్రత్యేక ఆహ్వానితులుగా రాష్ట్ర ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి చందు జనార్దన్, ఐజేయూ జాతీయ కార్యదర్శి సోమసుందర్, కార్యవర్గ సభ్యులు సురేష్‌కుమార్, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు అధ్యక్షుడు ఏచూరి శివ, జిల్లా ప్రధాన కార్యదర్శి బాబు, ఐజేయూ కౌన్సిల్ సభ్యుడు శ్రీనివాసులు, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎల్ హరికృష్ణ, ధర్మవరం రెవెన్యూ డివిజన్ అధ్యక్షుడు జానపాటి మోహన్, ప్రధాన కార్యదర్శి జాంపుల అజయ్, స్టేట్ కౌన్సిల్ సభ్యులు శ్రీనివాసరెడ్డి, జీవీ నారాయణ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రజల్లో విశ్వసనీయత పెంచుకునేలా జర్నలిస్టులు తమ వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ప్రధానంగా పుట్టపర్తితో పాటు ధర్మవరంలో చాలా మంది పాత్రికేయులకు నేటికీ నివేశన స్థలాలు లేవని, అవి మంజూరు చేయడంతో పాటు ధర్మవరంలో జర్నలిస్టుల కాలనీకి పునాది వేయాలని ఐవీ సుబ్బారావు చేసిన విజ్ఞప్తికి మంత్రి సానుకూలంగా స్పందించారు. అనంతరం ఏపీయూడబ్ల్యూజే సంఘం నాయకులు వివిధ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని మంత్రికి అందించారు. ఇటీవలమృతి చెందిన హిందూపురం ఇండియన్ ఎక్స్‌ప్రెస్ జర్నలిస్ట్ మల్లికార్జున కుటుంబానికి ఏపీయూడబ్ల్యూజే తరఫున రూ.20వేలు ఆర్థిక సహాయాన్ని మంత్రి అందించారు. జర్నలిస్టుల సంక్షేమానికి పరిటాల రవీంద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.లక్ష విరాళాన్ని పరిటాల శ్రీరామ్ ప్రకటించారు. అనంతరం పలువురు సీనియర్ పాత్రికేయులను ఈ సందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా నాయకులు, అన్ని మండలాల నుంచి విలేకరులు పాల్గొన్నారు.

మానవత్వం మరిచిన కుమారుడు



రత్నయ్య మృతదేహాన్ని అంత్యక్రియలకు తరలిస్తున్న దృశ్యం

మడకశిర రూరల్: ఓ తండ్రి మరణిస్తే అంత్యక్రియలకు హాజరు కాకుండా కుమారుడు ముఖం చాటేశాడు. మానవత్వం తలదించుకునే ఈ ఘటన మడకశిర మండలంలో వెలుగు చూసింది. వివరాలు... నాలుగేళ్ల క్రితం కర్ణాటకలోని పావగడ తాలూకా మాచరాజనహళ్లి గ్రామానికి చెందిన వృద్ధుడు రత్నయ్యను కొందరు వ్యక్తులు పిలుచుకొచ్చి మడకశిర మండలం ఛత్రం పంచాయతీలోని తులసీధామ ఆశ్రమంలో విడిచారు. రాజేష్ అనే కుమారుడు ఉన్నా ఏనాడూ తండ్రి బాగోగులు చూడలేదు. ఆశ్రమంలో చేర్పించిన తర్వాత ఈ నాలుగేళ్లలో ఒక్కసారి కూడా తండ్రిని చూసేందుకు రాలేదు. కనీసం తన తండ్రి ఎలా ఉన్నాడంటూ ఆశ్రమ నిర్వాహకులను ఆరా తీసింది లేదు. ఈ నేపథ్యంలో వయోభారంతో గురువారం తెల్లవారుజామున రత్నయ్య (75) మృతి చెందాడు. దీంతో విషయాన్ని బంధువులకు తెలిపి, కుమారుడికి సమాచారం అందించాలని ఆశ్రమ నిర్వాహకులు పలుమార్లు ఫోన్ చేశారు. అయితే సాయంత్రమైనా ఏ ఒక్కరూ రాకపోవడంతో చివరకు ఆశ్రమంలోనే రత్నయ్య అంత్యక్రియలు నిర్వహించారు.

'కనకదుర్గా' ఫైనాన్స్ కంపెనీ సిబ్బంది అరెస్ట్



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

ఉరవకొండ: అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఫేక్ అకౌంట్‌లు సృష్టించి, నకిలీ బంగారంతో రుణాలు పొందిన ఉరవకొండలోని శ్రీకనకదుర్గా ఫైనాన్స్ కంపెనీ సిబ్బందిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను గురువారం స్థానిక పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మహానంది, ఎస్ఐ జనార్దననాయుడు వెల్లడించారు. పట్టుబడిన వారిలో ప్రధాన నిందితుడు, బ్రాంచ్ మేనేజర్ పల్లా ప్రశాంత్ (కూడేరు మండలం మరుట్ల-2 కాలనీ నివాసి), అసిస్టెంట్ మేనేజర్ చాకలి వెంకటేష్ (ఉరవకొండ), ఆడిటర్ రామాంజనేయులు (తాడిపత్రి) ఉన్నారు. వీరు ఫేక్ అకౌంట్లు సృష్టించి నకిలీ బంగారాన్ని తాకట్టు పెట్టి రూ.56,62,940 రుణాన్ని పొంది సొంత అవసరాలకు వాడుకున్నారు. ఈ ఏడాది జనవరిలో చేపట్టిన ఆడిట్‌లో ఈ మోసం బట్టబయలైంది. దీంతో అదే నెల 26న కంపెనీ ప్రతినిధి తిరుపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. ఇదే కేసులో నాల్గో నిందితుడిగా ఉన్న జనరల్ మేనేజర్ జ్వాలా చంద్రశేఖరరెడ్డి ఈ నెల 9న న్యాయస్థానంలో లొంగిపోయారు. గురువారం ఉదయం చిన్నముష్టూరు వద్ద మంతనాలు జరుపుతున్న పల్లా ప్రశాంత్, చాకలి వెంకటేష్, రామాంజనేయులును గుర్తించి పోలీసులు అరెస్ట్ చేశారు. విచారణ అనంతరం నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు.

భార్యపై కొడవలితో దాడి



గాయపడిన నిర్మల

పరిగి: కుమార్తె పెళ్లికి రమ్మని ఆహ్వానించేందుకు వచ్చిన భార్యపై భర్త కొడవలితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. పోలీసులు తెలిపిన మేరకు.. హిందూపురానికి చెందిన కురుబ నిర్మలకు పరిగి మండలంలోని బీచిగానిపల్లి నివాసి కరియన్నతో 25 సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు ఉద్యోగ రీత్యా మరో ప్రాంతంలో స్థిరపడ్డాడు. నాలుగేళ్ల క్రితం కుటుంబ కలహాల నేపథ్యంలో కుమార్తెను పిలుచుకుని పుట్టింటికి నిర్మల చేరుకుంది. అప్పటి నుంచి తిరిగి కాపురానికి ఆమె వెళ్లలేదు. ఇటీవల కుమార్తెకు పెళ్లి నిశ్చయమైంది. దీంతో పెళ్లి పత్రికలు తీసుకుని అత్తింటి వారిని, బంధువులను ఆహ్వానించేందుకు గురువారం బీచిగానిపల్లికి చేరుకుంది. అత్తింటిలో కాలుపెట్టిన ఆమెపై అప్పటికే కక్ష పెంచుకున్న భర్త కరియన్న కొడవలితో దాడి చేశాడు. ఆ సమయంలో నిర్మల కేకలు వేయడంతో అప్రమత్తమైన చుట్టుపక్కల వారు వెంటనే కరియన్నను అడ్డుకుని బాధితురాలిని హిందూపురంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ రంగడు యాదవ్ తెలిపారు.

పోక్సో కేసులో నిందితుడికి రిమాండ్

గార్లదిన్నె: మైనర్ బాలికను వంచించి బాలింతను చేసిన యువకుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు గార్లదిన్నె పీఎస్ ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపారు. వివరాలను గురువారం ఆయన వెల్లడించారు. వజ్రకరూరు మండలం రాగులపాడుకు చెందిన మల్లికార్జున ఐదేళ్లుగా గార్లదిన్నెలోని ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో అదే కాలనీలో నివాసముంటున్న మైనర్ బాలికను తన మాయ మాటలతో లోబర్చుకుని పలుమార్లు అత్యాచారం చేశాడు. దీంతో బాలిక గర్భం దాల్చి రెండు రోజుల క్రితం ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఘటనపై బాధిత బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మల్లికార్జునపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసిన పోలీసులు గురువారం ఉదయం నిందితుడిని అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

'హంద్రీ-నీవా'ను బతకనిద్దాం

- రైతు సంఘం జిల్లా కార్యదర్శి మల్లికార్జున

అనంతపురం అర్బన్: హంద్రీ-నీవా ప్రాజెక్టును ప్రభుత్వం చంపే ప్రయత్నం చేస్తోందని, కూటమి సర్కార్ చర్యలను అడ్డుకుని హంద్రీ-నీవా ప్రాజెక్ట్‌ను బతకనిద్దామంటూ ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున పిలుపునిచ్చారు. గురువారం అనంతపురంలోని ఆ సంఘం కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో సాగునీటి ప్రాజెక్టులను పూర్తికి నిధులు, ప్రతి ఎకరాకూ సాగునీరు, ప్రతి గ్రామానికీ తాగునీరు అందించేలా నికర జలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. డిమాండ్ సాధనలో భాగంగా మరో మారు ఉద్యమానికి ఊపిరి పోసే దిశగా ఈ నెల 22, 23 తేదీల్లో వైఎస్సార్ జిల్లా కడపలో ప్రాజెక్టుల సదస్సు జరుగుతుందన్నారు. మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.